సాక్షి
పల్నాడు
మంగళవారం। 6 । జూన్ । 2023



మహంకాళీ గుడి హుండీ లెక్కింపు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి గుడి హుండీల ఆదాయం రూ.16,16,352 వచ్చింది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.3,400, మోడల్ ధర రూ.2,600 వరకు పలికింది.



దుర్గమ్మ సన్నిధిలో భారతీ స్వామి

విజయవాడపశ్చిమ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను కర్ణాటక శివగంగలోని శృంగేరీ పాలిత శివగంగ పీఠం పీఠాధిపతి పురుషోత్తమ భారతీ స్వామిజీ సోమవారం దర్శించుకున్నారు.

మృత్యువేగం

- ట్రాక్టర్ బోల్తాపడి ఏడుగురు దుర్మరణం
- మృతులంతా మహిళలే
- కొండేపాడు ఊరంతా విషాదం
- 22 మందికి గాయాలు
- శుభకార్యానికి వెళ్తుండగా దుర్ఘటన
- డ్రైవర్ అతివేగమే కారణం

ఆనందాలు అంతలోనే ఆవిరయ్యాయి. అప్పటివరకు చెప్పుకున్న ముచ్చట్లు ఆర్తనాదాలయ్యాయి. బంధువుల ఇంట శుభకార్యానికి సంతోషంగా బయలుదేరిన ఆ కుటుంబాల్లో పెను విషాదం రేగింది. ఏడు ప్రాణాలు మృత్యుఒడిలో బోల్తాపడ్డాయి. మరో 22 మంది క్షతగాత్రులయ్యారు. ఈ హృదయ విదారక ఘటన ప్రత్తిపాడు మండలం వట్టిచెరుకూరు వద్ద జరిగింది. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం వల్ల కొండేపాడు ఊరుఊరంతా విషాదంలో మునిగిపోయింది.



దుర్ఘటనలో మరణించిన వారిని ట్రాక్టర్ ట్రక్కులో గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు/నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కొండేపాడు దళితవాడకు చెందిన సుమారు 30 మందికి పైగా మహిళలు సోమవారం మధ్యాహ్నం పొన్నూరు మండలం జూపూడిలో పుష్పాలంకరణ వేడుకకు వెళ్లేందుకు ట్రాక్టర్‌పై బయల్దేరారు. డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా నడపటంతో అదుపుతప్పి వట్టిచెరుకూరు శివారు పెట్రోలు బంకు సమీపంలో పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లి తిరగబడింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు కింద నలిగిపోయి మిక్కిలి నాగమ్మ (55), గనికపూడి మేరమ్మ (50), గనికపూడి రత్నకుమారి (55), కట్టా నిర్మల (55), గనికపూడి సుహాసిని (40), మామిడి ఝాన్సీ రాణి (46) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గనికపూడి సలోమి (55)ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందింది.

ఉపాధి పనులకు వెళ్లి వచ్చి..

గ్రామంలోని దళితవాడకు చెందిన 30 మంది మహిళలు ఉదయం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనుల అనంతరం పుష్పాలంకరణ వేడుకకు వెళ్లాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం గ్రామం నుంచి ట్రాక్టర్‌లో బయల్దేరారు. అప్పటికే ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో మార్గమధ్యలో రోడ్డు పక్కన ట్రాక్టర్‌ను నిలిపి సోడాలూ తాగారు. ఆపై ముందుకు కదిలిన నిమిషాల వ్యవధిలోనే ఘోర ప్రమాదం జరిగింది.



ప్రమాద స్థలంలో క్షతగాత్రుల హాహాకారాలు

ప్రాణనష్టం తగ్గించిన పొక్లెయినర్

ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌లో 30 మందికిపైగా ఉన్నారు. ఒక్కసారిగా ట్రాక్టర్, ట్రక్కు బోల్తా పడటంతో సుమారు ఇరవై మందికిపైగా ట్రక్కు కింద చిక్కుకుపోయారు. ఆ సమయంలో పెట్రోల్ బంకు పక్కనే పొక్లెయినర్ ఉండటంతో స్థానికులు దాని సాయంతో ట్రక్కును పైకిలేపి వెంటనే క్షతగాత్రులను బయటకు తీశారు. లేకుంటే మృతుల సంఖ్య మరింత పెరిగేదని స్థానికులు చెబుతున్నారు.

దూకేసిన ట్రాక్టర్ డ్రైవర్..

ట్రాక్టర్ నుంచి పక్కకు దూకేసి డ్రైవర్ తన ప్రాణాలను కాపాడుకున్నాడు. అతివేగం వల్ల ఒక్కసారిగా వాహనం అదుపుతప్పడంతో ప్రాణభయంతో ట్రాక్టర్ నడుపుతున్న 23 ఏళ్ల యువకుడు స్టీరింగ్ వదిలేసి, రోడ్డుపైకి దూకేశాడు. స్వల్పంగా గాయపడిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోదనలతో మిన్నంటిన జీజీహెచ్

గుంటూరు జీజీహెచ్ మృతుల కుటుంబీకుల రోదనలతో మిన్నంటింది. తల్లి చనిపోయిందని ఒకరు, సోదరి మరణించిందని మరొకరు గుండెలవిసేలా రోదించారు. స్ట్రెచర్లపై నిర్జీవంగా పడిఉన్న మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ దృశ్యాలు చూపరుల హృదయాలను ద్రవింపజేశాయి.

ప్రజాప్రతినిధుల పరామర్శ

జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుంటూరు డెప్యూటీ మేయర్లు బాలవజ్రబాబు, షేక్ సజీలా, వైఎస్సార్ సీపీ నేత మేకతోటి దయాసాగర్ తదితరులు ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే వరకు అక్కడే ఉండి వైద్యులు, పోలీసులకు సూచనలు చేశారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జిల్లా యంత్రాంగం అంతా జీజీహెచ్ వద్దే

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ పలువురు జిల్లా అధికారులు జీజీహెచ్ వద్దకు చేరుకున్నారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడు తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. వైద్యాధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించారు.

క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే..

22 మంది క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రభావతి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మెరుగైన చికిత్స అందిస్తున్నట్టు వివరించారు.

గాయపడిన వారు..

ప్రమాదంలో 22 మంది గాయపడ్డారు. జి.బుజ్జి, డి.వర్థిని, జె.కుమారి, ఎం.పద్మ, ఎం.వజ్రమ్మ, ఆర్.సుబ్బమ్మ, జి.సుజాత, జె.ఆనందకుమారి, ఎస్.నాగమ్మ, ఎం.అరుణకుమారి, డి.ఉషారాణి, జి.కాంతమ్మ, ఎం.విక్టోరియా, ఎం.సుజాత, ఎం.హన్సిక, జి.రత్నకుమారి, కె.ఆనందమ్మ, జె.సంతోషమ్మ, డి.జయమ్మ, ఏసుమణి, కె.కుసుమ, డి.కరుణకుమారి గాయపడినవారిలో ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనాల్లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

దురదృష్టకర ఘటన : అంబటి

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఘటన చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

కలచివేసిన ఘటన : సుచరిత

మాజీ హోంమంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ ఏడుగురి మృతి కలచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్ప గాయాలైన వారికి రూ.25 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని వివరించారు. బాధితులకు తక్షణమే ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారని సుచరిత వెల్లడించారు.



బోల్తాపడిన ట్రాక్టర్

న్యూస్‌రీల్

ఆర్టీసీ జిల్లా అధికారిగా రవికాంత్ బాధ్యతల స్వీకరణ



పాత గుంటూరు: ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎం.రవికాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు డెప్యూటీ సీటీఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై గుంటూరుకు వచ్చారు. ఇప్పటి వరకు జిల్లా ప్రజా రవాణా అధికారిణిగా పనిచేసిన జి.విజయగీత బదిలీపై విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. రవికాంత్‌కు పలువురు ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని పేర్కొన్నారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 30 మంది బాల కార్మికులను గుర్తించామని, వీరిలో 28 మందిని వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించామని, మిగిలిన ఇద్దరికి తాత్కాలిక వసతి గృహంలో ఆశ్రయం కల్పించామని వివరించారు. ఆమె మాట్లాడుతూ గుర్తించిన బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు.

కానుకలు కురి'పించెను'



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. వలంటీర్లు ఇంటి ముంగిటకే వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. సోమవారం సాయంత్రం నాటికి 98.91 శాతం పంపిణీ పూర్తయింది. ఈనెలలో 2,51,264 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.69.02 కోట్లు కేటాయించింది. సోమవారం సాయంత్రానికి 2,48,517 మంది లబ్ధిదారులకు రూ.68.26 కోట్లు అందజేశారు.

పిల్లల్లో అతిసార నియంత్రణకు కృషి

నరసరావుపేట: జిల్లాలో సోమవారం నుంచి 17వరకు ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్యక్రమ వాల్‌పోస్టర్, కరపత్రాలను వైద్యాధికారులతో కలిసి జేసీ ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ పరిసరాలు, తాగునీరు, చేతులు శుభ్రపర్చుకునే విధానం తదితర ఆరు దశల గురించి, గృహాలలో లభ్యమయ్యే ఫ్లూయిడ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, మాతా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ నాగపద్మజ, జిల్లా ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ బీవీ రంగారావు, డీఆర్వో కె.వి నాయకం పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు వచ్చే నీటి చేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

అమరేశ్వరస్వామి ఆలయం ఈఓగా వేముల గోపి



పెదకూరపాడు: అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా వేముల గోపి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఈవో సునీల్ ఉండవల్లి గ్రూపు టెంపుల్‌కు బదిలీ అయ్యారు. కోటప్పకొండ ఈఓగా ఉన్న వేముల గోపి అమరేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వేముల గోపి మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి, సదుపాలయ కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

12న క్రోసూరుకు సీఎం వైఎస్ జగన్



క్రోసూరు మోడల్ స్కూల్ వద్ద సభాస్థలం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజకుమారి

- ముఖ్యమంత్రి సభను జయప్రదం చేద్దాం
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపు

క్రోసూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న క్రోసూరుకు రానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం చుక్కల భూముల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈనెల 12న క్రోసూరుకు రానున్నారని వివరించారు. మోడల్‌స్కూల్ ఆవరణలో జగనన్న విద్యా కానుక నిధులు విడుదల చేస్తారని పేర్కొన్నారు. అనంతరం రూ.215 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. రూ.149 కోట్లతో నిర్మించనున్న అమరావతి- బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని, మాదిపాడు వద్ద కృష్ణా నదిపై రూ.60 కోట్లతో నిర్మించనుబోతున్న బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తారని వెల్లడించారు. క్రోసూరులో రూ.7.25 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

సీఎం జగన్ పర్యటనకు స్థల పరిశీలన

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఉన్నతాధికారులు క్రోసూరులో సోమవారం పర్యటించారు. సత్తెనపల్లి ఆర్డీఓ ఎంఎల్ఎస్ రాజకుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానాయక్, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ పున్నారావు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావులు స్థానిక మోడల్ స్కూల్ వద్ద స్థల పరిశీలన చేశారు. బహిరంగ సభ, హెలిప్యాడ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉందా లేదా అనే అంశాలపై దృష్టి సారించి నివేదిక అందజేసేందుకు పరిశీలించారు.

నాడు–నేడు కమిషనర్ పర్యటన

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో స్థానిక మోడల్ స్కూల్‌ను నాడు–నేడు కమిషనర్ కాటమనేని భాస్కర్, పీడీ కాలేబు సందర్శించారు. పాఠశాల, హాస్టల్, పాఠశాలలోని బల్లలు, కుర్చీలు, విద్యుత్, వెంటిలేషన్, టాయిలెట్స్ పరిస్థితి ఎలా ఉన్నదో పరిశీలించారు. ఎటువంటి లోపాలు లేకుండా అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని సూచించారు.

అర్జీలకు వేగంగా పరిష్కారం

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నరసరావుపేట: ప్రజల అర్జీల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకంతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద జేసీ 126 అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమానికి తరలి వచ్చిన ప్రజలు 250 మందికి రెంటచింతలకు చెందిన గుంటక వెంకటధర్మ కోటిరెడ్డి తండ్రి పుల్లారెడ్డి జ్ఞాపకార్థం ఉచిత అన్నదానం నిర్వహించారు. దాతలను జాయింట్ కలెక్టర్, డీఆర్వో సత్కరించారు.



అర్జీదారుల గోడు వింటున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో వినాయకం

చనిపోయిన వ్యక్తిపేరుపై పింఛన్ స్వాహా

క్రోసూరు మండలం దొడ్లేరు ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధుడు పారా కిరీటి మరణించాడు. అతని పేరుపై మరొకరు బయోమెట్రిక్ చేసి 2011 నుంచి ప్రతి నెలా వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నారు. వెంటనే విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

– పారా బాబూరావు, దొడ్లేరు, క్రోసూరు మండలం

కౌలు రైతులకు గ్రామసభలు నిర్వహించాలి

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని కౌలు రైతులకు గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం నుంచి వచ్చే రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, బ్యాంకు రుణాలు అందేలా చూడాలి.

– మల్లెల చిన్నప్ప, జిల్లా కో–ఆర్డినేటర్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో అటవీశాఖ ఆధ్వర్యంలో జేసీ జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా అధికారులంతా తమ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని సూచించారు. మూడునెలల పాటు పర్యావరణ హిత కార్యక్రమాలు చేపట్టాలని, మూడునెలల అనంతరం మార్పును నివేదిక రూపంలో అందించాలని సూచించారు.



పర్యావరణంపై ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో వినాయకం



నరసరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

డీఎండీహెచ్‌వో కార్యాలయంలో...

పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం సాయంత్రం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, మాతృశిశుసంరక్షణ అధికారి డాక్టర్ నాగపద్మజ, డాక్టర్ హనుకుమార్, డెప్యూటీ డెమో ఒ.సాంబశివరావు పాల్గొన్నారు.

పట్టణంలో మున్సిపల్ ఉద్యోగుల ర్యాలీ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రజలకు అవగాహన కలిగించే నిమిత్తం మున్సిపల్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు.

పర్యావరణాన్ని కాపాడదామనే నినాదాలు, ప్లకార్డులు పట్టుకుని పురపాలక సంఘ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రోడ్లగుండా తిరిగి పురపాలక సంఘానికి చేరుకుంది. ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేసి క్లాత్ బ్యాగ్స్ వినియోగించి పర్యావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు కోరారు.



డీఎంహెచ్‌వో కార్యాలయంలో మొక్కలు నాటుతున్న వైద్యాధికారులు

వెయిట్ లిఫ్టర్ 'లాల్'సలాం

- రాణిస్తున్న లాల్‌బషీర్
- ఖేలో ఇండియా జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ
- నోయిడాలో గోల్డ్‌మెడల్ అందుకున్న బలశాలి
- పంజాబ్‌లోని పాటియాలలో కామన్‌వెల్త్ క్రీడలకు శిక్షణ



నోయిడాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ అందుకున్న లాల్‌బషీర్(ఫైల్)



బరువు ఎత్తుతున్న లాల్‌బషీర్(ఫైల్)

సత్తెనపల్లి: అతనో పేద విద్యార్థి. పేరు లాల్‌బషీర్. సత్తెనపల్లిలోని అన్నం గురవమ్మ కృష్ణమూర్తి డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తపన, స్థిరమైన లక్ష్యం ఉంటే అనుకున్నది సాధించవచ్చని, పేదరికం ఏమాత్రం అడ్డుకాబోదని నిరూపించాడు. చదువుతోపాటు వెయిట్‌లిఫ్టింగ్ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లోనూ రాణిస్తూ ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నాడు. ప్రస్తుతం కామన్‌వెల్త్ స్పోర్ట్స్‌కు ఎంపికై పంజాబ్ రాష్ట్రం పాటియాలలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఎన్ఐఎస్)లో శిక్షణ పొందుతున్నాడు.

నేపథ్యమిదీ..

లాల్‌బషీర్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. వీరిది పశ్చిమగోదావరి జిల్లా. లాల్‌బషీర్ చదువు కోసం సత్తెనపల్లి వచ్చాడు. వెయిట్ లిఫ్టింగ్‌పై మక్కువతో దాదాపు రెండేళ్లుగా సాధన చేస్తున్నాడు. అనతి కాలంలోనే పట్టు సాధించాడు. పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాడు. 2022 డిసెంబర్‌లో పంజాబ్‌లో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆల్ ఇండియా స్థాయిలో రజిత పతకాన్ని సాధించాడు. ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగిన ఖేలో ఇండియా జాతీయ స్థాయి విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో –2023 సంవత్సరానికి గాను స్నాచ్‌లో 140 కిలోలు క్లీన్, జర్క్‌లో 161 కిలోలు, మొత్తం 301 కిలోల బరువులనెత్తి ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కామన్‌వెల్త్ పోటీలకు ఎంపికైన బషీర్ ప్రస్తుతం పంజాబ్‌లోని పాటియాలలో శిక్షణ పొందుతున్నాడు. తక్కువ సమయంలో ఈ స్థాయికి చేరుకొని తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. లాల్ బషీర్‌ను ఏజీకేఎమ్ పాలకవర్గ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ, కమిటీ సభ్యులు అన్నం కృష్ణప్రసాద్, అన్నం మురళీశ్రీనివాస్, ప్రిన్సిపాల్ రామిశెట్టి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు అభినందించారు.

కామన్‌వెల్త్ పోటీల్లో రాణించడమే లక్ష్యం

కామన్‌వెల్త్ పోటీల్లో దేశం తరఫున ఆడి రాణించడమే నా లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేస్తున్నాను. ఎక్కువ సమయం కేటాయిస్తున్నా.

– షేక్ లాల్‌బషీర్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు

పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు

పోక్సో కోర్టు జడ్జి కె.సీతారామకృష్ణారావు

గుంటూరులీగల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పర్యావరణానికి ప్లాస్టిక్ ముప్పు పొంచిఉందని చెప్పారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిలువరించిన నాడే మానవ జీవితం ఆనందమయం అవుతుందన్నారు. మొక్కలు నాటడం ద్వారా కొంతమేర పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత మాట్లాడుతూ చెట్లు, అడవులు నరికి ధ్వంసం చేయటం, వాయుకాలుష్యం, రసాయనాల వాడకం పెరగటం వల్ల ప్రతి ఇంట్లో ఏసీలు వాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. డీఎల్ఎస్ఏ డిఫెన్స్ కౌన్సిల్ కె.జీవరత్నం, డెప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ మధుబాబు, ప్యానల్ అడ్వకేట్లు సుబ్బయ్య, నవీన్, కాళిదాసు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు సీతారామకృష్ణారావు, అనిత

నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కరించండి

- జిల్లా పోలీసుల జగనన్నకు చెబుదాంలో 55 ఫిర్యాదులు స్వీకరణ
- బాధితులకు స్వయంగా అన్నదానం చేసిన ఎస్పీ, అధికారులు


జగనన్నకు చెబుదాంకు వచ్చిన బాధితులకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నరసరావుపేట: ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషిచేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్పీ ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాల సమస్యలకు సంబంధించి 55 ఫిర్యాదులను స్వీకరించారు. బాధితులకు ఫిర్యాదులను రాసిపెట్టడంలోను, వృద్ధులను ఎస్పీ వద్దకు తీసుకెళ్లి తీసుకురావటంలో పోలీస్ సిబ్బంది సహాయసహకారాలు అందించారు. తమ సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజలకు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ స్టేట్ కౌన్సిల్ మెంబర్, రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షుడు కాకుమాను శ్రీనివాసరావు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, డీఎస్పీలు కేవీ మహేష్, బి.ఆదినారాయణ, పల్లపురాజు, యు.రవిచంద్ర, ఆర్గనైజర్ బచ్చు వెంకటసత్యనారాయణలు స్వయంగా భోజనం వడ్డించారు.

డబ్బులు తీసుకొని బెదిరిస్తున్నారు

పట్టణానికి చెందిన ఒక వ్యక్తి 2018లో నా వద్ద రూ.70వేలు అప్పుగా తీసుకొని ఇవ్వకుండా నోటు కాల పరిమితి ముగిసేవరకు మభ్యపెట్టి ఇప్పుడు ఇవ్వనని బెదిరిస్తున్నాడు. మా డబ్బులు మాకు ఇప్పించి ఆదుకోండి.

–ఓ వ్యక్తి, నరసరావుపేట పట్టణం

సోదరినే మోసం చేసిన అన్న

నాకు చదువు లేకపోవడం వల్ల నా సోదరుడు ఇంటిని అతని కొడుకుకి చెందే విధంగా మోసం చేసి రాయించుకున్నాడు. ఇప్పుడు ఇంటిలో నుంచి బయటకు గెంటి వేశాడు. నా ఇల్లు నాకు ఇప్పించండి.

–ఓ మహిళ, వైకుంఠపురం గ్రామం, అమరావతి మండలం

రూ.42 లక్షలు ఇప్పించండి

పత్తి వ్యాపారం చేసే నేను 15 మంది రైతుల దగ్గర నుంచి సుమారు రూ.42 లక్షల విలువైన 700 క్వింటాల పత్తిని సేకరించి దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వ్యక్తికి అమ్మాను. అతను డబ్బులు ఇవ్వకుండా అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు. అతనిని పిలిపించి డబ్బులు ఇప్పించండి.

– ఓ వ్యక్తి, కారంపూడి

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం

- పట్టు వస్త్రాలు సమర్పించిన పీఆర్కే దంపతులు
- వాస్తు హోమం నిర్వహించిన పీవీఆర్ దంపతులు


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న పీఆర్కే దంపతులు, పీవీఆర్

మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆయా స్వామి వార్ల నూతన శిలా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు పరుశురాం రామాంజనేయ చార్యులు, రాజకృష్ణమాచార్యులు, ఈఓ గిరిరాజు నర్సింహబాబు ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభించారు. అందులో స్వామి వారికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రమాదేవి, మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకొని సమర్పించారు. ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ అభివృద్ధి కమిటీకి చెందిన వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లికార్జునరావు, గట్ల కోటిరెడ్డి ఆధ్వర్యంలో 12 మంది అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. ప్రతిష్ఠ హోమ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారికి పూజలు జరిపారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ దంపతులు పట్టు వస్త్రాలను దేవాలయానికి తీసుకొచ్చి విశేష పూజలు జరిపారు.

రూ.4.80లక్షలు అపహరణ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో పట్టపగలే చోరీ జరిగింది. బైక్ కవర్‌లో ఉన్న రూ.4.80లక్షలు దుండగులు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన పగడాల కోటేశ్వరరావు స్థానిక బ్యాంక్‌లో రూ.4.80లక్షల నగదు డ్రా చేశాడు. తన ద్విచక్రవాహనం ట్యాంక్ కవర్‌లో డబ్బుల సంచి పెట్టి తిరిగి వెళుతున్నాడు. పల్నాడు రోడ్డులోని ఫస్ట్ వార్డు స్కూల్ ఎదురు జ్యూస్ స్టాల్ వద్ద ఆగి జ్యూస్ తాగుతున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బైక్‌లోని డబ్బుల కవరు తీసుకుని ఉడాయించారు. బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

- మొక్కలు నాటి సంరక్షించండి
- జేఎన్‌టీయూ–ఎన్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు


కళాశాల ఆవరణలో మొక్కలు నాటిన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, సిబ్బంది

నరసరావుపేటఈస్ట్: ప్రతి విద్యార్థి రెండు మొక్కలు నాటి సంరక్షించాలని జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షించేందుకు మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని కోరారు. విద్యార్థులు తమ గ్రామాలలో సైతం తమ పెద్దలను చైతన్యపరిచి మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. పర్యావరణం దెబ్బతినటంతో భూగర్భ జలాలు అడుగంటి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.పి.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి ఐ.శ్రీఫణిసుష్మ, ఏఈ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జైల్లో పరిచయం.. దొంతనాలకు బీజం..!

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఏపీ, తెలంగాణ పరిధిలోని ఆరు జిల్లాలలో నేరాలు
- పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని ఆరు జిల్లాల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పిడుగురాళ్ల పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో వడ్లమాను శివారెడ్డి, పులి అంజిరెడ్డి, దేవరకొండ శ్రీను, కుంభా పెద్ద రోశయ్య ఉన్నారు. వీరందరూ పదుల సంఖ్యలో దొంగతనాలకు పాల్పడిన నేర చరిత్ర ఉంది. వీరి నుంచి రూ.ఏడు లక్షల విలువ చేసే కారు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చెడువ్యసనాలకు బానిసలై నిందితులు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన నిందితులు నలుగురు వివిధ కేసుల్లో నరసరావుపేట సబ్‌జైలులో ఉన్న సమయంలో ఒకరికొకరు పరిచయం పెరిగి కలసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. వీరు అధికంగా ప్రభుత్వ మద్యం షాపులు, దుకాణాల పైభాగంలో కన్నం వేసి దొంగతనాలకు పాల్పడే అలవాటు ఉందన్నారు. పార్కింగ్‌లో ఉన్న కారు, ద్విచక్ర వాహనాలు అపహరిస్తుంటారని పేర్కొన్నారు. గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలేనికి చెందిన వడ్లమాను శివారెడ్డిపైన 58కి పైగా కేసులు ఉన్నట్లు వెల్లడించారు. దొంగలించిన ద్విచక్ర వాహనాలలో ప్రయాణిస్తున్న వారిని జూలకల్లు అడ్డురోడ్ వద్ద పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. దొంగలను అరెస్ట్ చేయడంలో చొరవ చూపిన డీఎస్పీ పల్లపు రాజు, పిడుగురాళ్ల సీఐ ఆంజనేయులు, ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్‌ను ఎస్పీ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

జిల్లా సైన్స్ ఆఫీసర్ మధుకుమార్


బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విజేతలు

నరసరావుపేటఈస్ట్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మధుకుమార్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యం దెబ్బతింటే మానవాళి పలు విపత్తులకు గురవుతుందని తెలిపారు. మొక్కలు పెంచటం ద్వారా పర్యావరణ పరిరక్షణను చేపట్టవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. వ్యాస రచన పోటీలో విజేతలుగా నిలిచిన రెడ్డి.లలితసాయిఅక్షయ, ఎం.గీతాఅన్విత, ఉశస్విని, చిత్రలేఖనంలో వై.ప్రణతి, వి.మీనాకుమారి, జి.గాయత్రిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, ఉపాధ్యాయులు ఎం.శివశంకర్, షేక్ రహీమ్, ఎం.అప్పారావు, గ్రంథాలయ సిబ్బంది ఏసుబాబు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నందిగామ జగనన్న హౌసింగ్ కాలనీలో గృహప్రవేశం


నందిగామలో ప్రారంభించిన గృహం


గృహ ప్రవేశంలో మంత్రి అంబటి రాంబాబుకు వస్త్రాలు పెడుతున్న లబ్ధిదారురాలు పొట్లూరి రమణ

సత్తెనపల్లి: మండల పరిధిలోని నందిగామలో జగనన్న హౌసింగ్ కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతంగా నిర్మిస్తున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన పొట్లూరి రమణ గృహ నిర్మాణం పూర్తి చేసుకొని సోమవారం గృహప్రవేశం చేసింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 58 గృహాలు ఇక్కడ మంజూరు కాగా 35 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. 18 గృహాలు పూర్తయ్యాయి. లబ్ధిదారురాలు పొట్లూరి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం సెంటున్నర స్థలం కేటాయించిందని, గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. వీటికి తోడు మరికొంత నగదు పెట్టుకొని కింద మూడు గదులు, పైన అంతస్తు వేసుకున్నామన్నారు. సొంత ఇంటి కల సాకారమైందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో బోల్తా... 9 మందికి స్వల్ప గాయాలు

గురజాల : ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడి తొమ్మిది మందికి స్వల్ప గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం...పిడుగురాళ్ల, జమ్మలమడక గ్రామాలకు చెందిన పలువురు గురజాలలో జరిగే ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో నడికూడి రైల్వే బ్రిడ్జి వద్ద ఆటో టైర్‌కు పంచర్ కావడంతో అదుపుతప్పి పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకువెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదంలో ఆలేటి మేరమ్మ, అఖిల్, పవన్, గెల్లి పోగు పాపయ్య, జ్యోతి, యేసుబాబు, కె అలిరాణి, కుమారిలను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

సత్తాచాటిన గుంటూరు జిల్లా ఎడ్లు

స్వర్ణలో రాష్ట్రస్థాయి పోల్‌రాధా ఎడ్ల పోటీలు

కారంచేడు: గ్రామ దేవత స్వర్ణమ్మతల్లి తిరునాళ్లను పురస్కరించుకొని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి జూనియర్ నాటు ఎడ్ల పోల్‌రాధా (ఒంగోలు జాతి) పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన ఎడ్ల జత సత్తా చాటాయి. సోమవారం వేకువజాము వరకు జరిగిన పోటీల్లో నిర్ణీత 10 నిమిషాల వ్యవధిలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరికి చెందిన ఎడ్ల జత 2478.9 అడుగుల దూరం లాగి తన సత్తా చాటి మొదటి బహుమతిని (రూ.30,116లు) కైవసం చేసుకున్నాయి. రెండో బహుమతిని ప్రకాశం జిల్లా మడనూరుకు చెందిన బత్తుల వంశీ కృష్ణారెడ్డికి చెందిన ఎడ్లజత 2400 అడుగుల దూరం లాగి రూ.20,116 సంపాదించాయి. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడంవారిపాలేనికి చెందిన కుంచాల వేదశ్రీ–లతారెడ్డిలకు చెందిన ఎడ్ల జత 2179.5 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం రూ.12,116 సాధించాయి. బాపట్ల జిల్లా పోతురాజు కొత్తపాలేనికి చెందిన కావూరు వెంకటేశ్వర్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత 2107.4 అడుగల దూరం లాగి నాలుగో స్థానం రూ1,116 గెల్చుకున్నాయి. ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు చెందిన 16 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన ఎడ్ల జతల యజమానులను నిర్వాహకులు ఘనంగా సత్కరించి బహుమతులు అందించారు.